క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



రెంటచింతల: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ సెంటర్, పోలీస్ స్టేషన్ రహదారిలో బీజేపీ నాయకుడు ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు పాశం మట్టారెడ్డి ఆదివారం పాల్గొని ప్రజలకు తాగునీరు, పులిహోర పంపిణీ చేశారు. బీజేపి రాష్ట్ర కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు ఎస్.పుల్లారెడ్డి, జి.నాసరయ్య, గాదె సైదారెడ్డి, జి.మల్లికార్జునరావు, పూర్ణారావు, వరాచారి, అయోధ్యరాముడు పాల్గొన్నారు.

శరవేగంగా వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణం



శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ శివారు కృష్ణాపురంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరినట్లు కమిటీ ప్రతినిధి దమ్మాలపాటి సురేష్ ఆదివారం తెలిపారు. గ్రామస్తులు, దాతలు సహకారంతో రూ.25 లక్షల వ్యయంతో గత ఏడాది డిసెంబరు 30న పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈనెల 28న ప్రతిష్ట వేడుకలు ప్రారంభమై 30న ముగుస్తాయని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో గ్రామస్తులంతా భాగస్వామ్యులు కావడంతో శరవేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

ఉగాది పురస్కారాలు ప్రదానం



వినుకొండ : పట్టణంలోని గుర్రం జాషువా కళా ప్రాంగణంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మందిని రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయ పండుగలు జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ వై.వి.నారాయణ, ఆళ్ల శ్రీనివాసరావు, కూచి రామాంజనేయులు, ఎస్‌కే బాజీ, శ్రీనివాసరావు, గిరిబాబు, షేక్ షకీలా, రమేష్, మేఘన, రాజారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు బియ్యం, వస్త్రాల పంపిణీ

వినుకొండ : బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ మాధవరావు ఆధ్వర్యంలో విద్యానగర్ 4వ లైన్‌లో ఆదివారం నలుగురు పేద బ్రాహ్మణులకు బియ్యం, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, ఉల్లగంటి బాలగురునాథం, నందిగామ పవన్‌కుమార్, గాయత్రి, కృష్ణమోహన్, ఎం.వి.శర్మ, భువనగిరి సుబ్రహ్మణ్యం, దారా రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచార్యులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ ఆదివారం తెలిపారు. రావిపాడు రోడ్డు లక్ష్మీనారాయణపురం ప్రాంతంలో నివసిస్తున్న కాకుమాను ప్రశాంతి తన భర్త చలపతి అదనపు కట్నం కోసం కొంత కాలంగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆరోగ్య కేంద్రానికి బీరువా వితరణ

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి ఉప ఆరోగ్య కేంద్రానికి రూ. 8వేల విలువైన బీరువాను శనివారం గ్రామానికి చెందిన ముక్కపాటి నాగేశ్వరరావు, కోల్డ్–హాట్ వాటర్ విడుదల చేసే యంత్రాన్ని కాసరగడ్డ వెంకటరత్నం వితరణ చేసినట్లు వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పృథ్వీరాణి, ఆరోగ్య కార్యకర్త దాసరి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



సీతారాముల కల్యాణానికి వస్తున్న దాతలు



భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న సభ్యులు



కారెంపూడిలో ఎదురుకోలు ఉత్సవం అనంతరం మందిరానికి సీతారాముల విగ్రహాలు

రమణీయం..సీతారాముల కల్యాణోత్సవం


- వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు
- కిటకిటలాడిన రామాలయాలు

మాచర్ల: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రామాలయాలు జై..శ్రీరామ్ నినాదాలతో మారుమోగాయి. దేవస్థానాల ముందు చలువ పందిళ్లు వేసి వేదికపై సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. పుణ్యదంపతులు పీటలపై కూర్చుకుని కల్యాణకర్తలు వ్యవహరించగా..పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ తంతు పూర్తిచేశారు. భక్తులు కోదండరాముని కల్యాణాన్ని తిలికించి, పులకించిపోయారు. రామ నామం జపిస్తూ.. వడపప్పు, పానకం ప్రసాదాలు స్వీకరించి ఆనందించారు.

● మాచర్ల పట్టణంలోని కోదండరామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేణుగోపాలాచారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బచ్చు రామారావు, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహరావు, మారం ప్రసాద్ పూజల్లో పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ రహదారిలో సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ వడ్డెర సంఘ పెద్దలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పట్టణంలో శ్రీశైలం రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

మాచర్ల రూరల్: శ్రీరామ నవమి వేడుకలను మండలంలోని కొత్తపల్లి, తాళ్ళపల్లి, కంభంపాడు, భైరవునిపాడ, జమ్మలమడక, గన్నవరం, కొప్పునూరు, అలుగురాజుపల్లి, రాయవరం గ్రామాలలో వైభవంగా ఆదివారం నిర్వమించారు. సీతారాముల వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. పురోహితులు బోపూడి గిరిశర్మ నేతృత్వంలో కొత్తపల్లి కోదండ రామాలయంలో పూజలు చేశారు.

కారెంపూడి: మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. కారెంపూడిలో శ్రీరాముని శోభాయాత్ర జరిగింది.



మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణ

మాచర్ల: పట్టణంలో శ్రీరామ శోభాయాత్రను వేడుకగా నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ..నినాదాలు చేస్తూ భక్తులు భారీగా పాల్గొన్నారు. కోదండ రామాలయం నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ కొనసాగింది. కంభంపాటి అనిల్‌కుమార్, కంభంపాటి వెంకట రమణ (చంటి), మల్లికార్జునరావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: శ్రీరామనవమిని పురస్కరించుకొని వెల్దుర్తిలోని కోదండరామాలయంలో జరిగిన సీతారామ కల్యాణోత్సవంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు పాల్గొన్నారు. ఉదయం స్వామి వారి కల్యాణోత్సవం అర్చకులు జిగురు నరసింహయ్య ఆధ్వర్యంలో వేడుకగా చేశారు. భక్తులకు ఆలయ కమిటీ వడపప్పు, పానకం అందజేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.

విజయపురిసౌత్: స్థానిక సీతారామాలయంలో సీతారాముల కలక్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిత్యహోమాలు, ఎదురుకోల ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు హనుమంత వాహన సేవ, రాత్రి మహా శాంతి హోమం చేపట్టారు. కల్యాణ కర్తలుగా స్వామి తరుపున కోలా హేమంత్‌రెడ్డి, శృతిరెడ్డి, అమ్మవారి తరుపున కర్ల యల్లమందారెడ్డి, సంపూర్ణ దంపతులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు, రఘునాథాచార్యుల కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీమాన్ రత్నాకరం మాధవాచార్యులు, శిష్య బృందం వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదాన చేశారు. ఆలయ అధ్యక్షుడు కోలా వసంతకుమార్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చిలమకూరి నాగిరెడ్డి, కోలా కృష్ణారెడ్డి, శ్రీ సీతారామాలయ కమిటీ కార్యదర్శి మన్నేపల్లి రామాంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలో పాల్గొన్న మాచర్ల ఎమ్మెల్యే జేబీఆర్ దంపతులు

గురజాల: నియోజకవర్గంలోని శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం చేయించారు. శ్రీరాముని శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి రెడ్డి బండ సెంటర్ మీదుగా బ్రహ్మనాయుడు విగ్రహం వరకు శ్రీరాముని జెండాలను చేత బూని ర్యాలీగా సాగారు.



చెన్నాయపాలెంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పూజారులు

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో దంపతులు పీతలపై కూర్చుని, వేద పండితులు వేదమంత్రాలతో స్వామివారి కల్యాణం జరిపించారు. మాచవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తాటి చలవ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.

రెంటచింతల: మండలంలోని శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెంటచింతల, మిట్టగుడిపాడు, మల్లవరం, గోలి, తుమృకోట, రెంటాల, పశర్లపాడు, పాలువాయి, మంచికల్లు, జెట్టిపాలెం, పాలువాయిగేటు తదితర గ్రామాల్లో సీతారాములవారి కల్యాణం కనులపండువగా నిర్వహించి, అన్నదాన చేశారు. పశర్లపాడు గ్రామంలో 1,500 మంది భక్తులకు మహాన్నదానం చేపట్టారు. ఉత్సవ దేవతామూర్తుల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రెంటచింతల పురవీధులలో ద్విచక్రవాహనాలతో యువత జై శ్రీరామం అంటూ ర్యాలీ నిర్వహించారు.



రైల్వే స్టేషన్ రోడ్డులోని సీతారామాలయంలో ప్రత్యేక పూజలు

దాచేపల్లి: శ్రీరామనవమి పండుగ వేడుకలు మండల వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి. నారాయణపురంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి దంపతులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని రేవతి దంపతులు ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడికుడి రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రామాలయం, దాచేపల్లిలోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారిని పల్లకిపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



గురజాల: సీతారామలు కల్యాణంలో పాల్గొన్న దంపతులు



పాలువాయి గ్రామంలో సీతారాముల కల్యాణ వేడుక



నారాయణపురంలోని రామాలయంలో స్వామికి దంపతుల పూజలు



దాచేపల్లిలో పల్లకీలో శ్రీరాముని ఊరేగింపు

పార్టీ తరపున ప్రజలకు అండగా ఉండండి

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, సేవలందించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ మాచర్ల మండల అధ్యక్షుడిగా కొండా శివలింగరాజు నియమితులైన సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కార్యకర్తలకు, అభిమానులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన పిలుపును పాటిస్తూ ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ప్రతి గ్రామంలో పార్టీ సభ్యత్వం నమోదు చేస్తూ, పార్టీ ప్రతిష్ట కోసం పనిచేయాలని పిన్నెల్లి చెప్పారు. ఈ సందర్భంగా పీఆర్కేని కొండ శివలింగరాజు ఘనంగా సన్మానించారు. పార్టీ సీనియర్ కొమ్మారెడ్డి చలమారెడ్డి, ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు బూడిద సైదులు, బోయ వీరారెడ్డి, పుట్టా బ్రహ్మయ్య, దొడ్డా చిన్న పెద్దిరాజు, దొండేటి సాంబశివారెడ్డి, తంగిరాల రామిరెడ్డి, ఎన్ కేలానాయక్, కంబాల చిన వెంకయ్య, కొప్పుల హనిమిరెడ్డి, ముసలయ్య, గొబ్బూరి ఆదెయ్య, దుర్గెంపూడి సీతారామిరెడ్డి, మున్నా రామకృష్ణ, జూకూరి వెంకట్రామయ్య, వీరబోయిన గురవయ్య, కొండా గోపి, మల్లెల శ్రీను, లక్ష్మయ్య తదితరులున్నారు.



పిన్నెల్లిని సన్మానిస్తున్న శివలింగరాజు, పార్టీ నాయకులు

చలివేంద్రం ఏర్పాటు

మాచవరం: శ్రీరామనవమిని సందర్భంగా మండల కేంద్రం మిషన్ బావి సెంటర్‌లో సప్తగిరి ట్రేడర్స్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ కటకం సూర్యనారాయణ ఆరేటి వెంకటేశ్వర్లు, సూరె నాగేశ్వరావు, ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.

ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు

మాచర్ల: గుడ్ ఫ్రైడే సందర్భంగా ఉపవాస ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం ఆంధ్రా యివాంజిలికల్ చర్చిలో పశ్చిమ సినడ్ బిషప్ చాట్ల ఐజయ్య, తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ రవికుమార్, బేతేలు మందిరంలో పాస్టర్ జాన్ వెస్లి, మరనాత మందిరంలో పాస్టర్ ఎలీషా, షాలోం మందిరంలో పాస్టర్ అభిషేక్, ఆర్‌సీఎం చర్చి, నిత్య సహాయ మాత ఫాదర్ రఫేల్‌రెడ్డి (రాయపరెడ్డి) ఆయా చర్చిల్లో ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలు వివరించారు. పట్టణంలోని మరో 50 చర్చిలలో ఉపవాస ప్రార్థనలు జరిగాయి.

ముగిసిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్



విజేతగా నిలిచిన బాలుర జట్టు



విజేతగా నిలిచిన బాలికల జట్టు

పిడుగురాళ్లరూరల్: క్రీడలలో రాణించి పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకొనిరావాలని తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ బొల్లా గిరిబాబు అన్నారు. జానపాడు గ్రామంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థలో అండర్ 19 రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. బాలు విభాగంలో విజేతగా ఎన్‌టీఆర్ జిల్లా జట్టు నిలవగా, రన్నర్‌గా నెల్లూరు, తృతీయ స్థానంలో పల్నాడు, తిరుపతి జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో విజేతగా కడప, రన్నర్‌గా నెల్లూరు, తృతీయ స్థానంలో బాపట్ల, తిరుపతి జిల్లాల జట్లు నిలిచాయి. క్రీడాకారులకు కప్, షీల్డ్, సర్టిఫికెట్లను అందజేశారు. అబ్బరర్ హస్సాన్, జిల్లా సెక్రటరీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

పిడుగురాళ్ల: ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటన మండలంలోని తుమ్మల చెరువు చెట్టు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు.. మాచర్ల వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొనటంతో రెండు బస్సులు స్వల్పంగా దెబ్బతిన్నాయి. బస్సులో పరయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో అందరు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య, ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 2014–15లో 10వ తరగతి చదివిన విద్యార్థులు కుశల ప్రశ్నలు, చిన్ననాటి జ్ఞాపకాలతో సరదాగ గడిపారు. 72 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకొన్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ రె. ఫాదర్ పీటర్ పాపయ్య మాట్లాడుతూ సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థులకు మరుపురాని రోజుగా మిగిలిపోతుందన్నారు.

మాంసం దుకాణాలపై దాడులు



నరసరావుపేట టౌన్: పట్టణంలోని పలు మాంసం దుకాణాలపై జిల్లా కల్తీ ఆహార నియంత్రణ శాఖ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంయుక్తంగా ఆదివారం దాడులు చేశారు. బాలయ్యనగర్‌కు చెందిన రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూ వ్యాధితో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని చికెన్, మటన్ దుకాణాలతో పాటు పలు హోటళ్లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమాదేవి సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. జీవాలు, కోళ్లు ఎక్కడ నుంచి తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారని ఆరా తీశారు. మాంసం విక్రయ కేంద్రాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పలు రెస్టారెంట్లలో తనిఖీలు చేశారు.